క్లుప్తంగా

సామూహిక లలితా సహస్రనామ పారాయణం



శీతలమాత ఆలయంలో సామూహిక పారాయణం చేస్తున్న మహిళలు

నర్సాపూర్: పట్టణంలోని శీతలమాత ఆలయంలో ఆదివారం మహిళలు సామూహిక లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. ఆలయం వార్షికోత్సవం ముగిసిన సందర్భంగా ఆదివారం ఆలయ ఆవరణలో ఓడిబియ్యం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ ఉత్సవ నిర్వాహకులు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం చేశారు.

గ్రామ కమిటీల ఏర్పాటు



రెడ్డిపల్లిలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడికి నియామక పత్రం అందిస్తున్న రామస్వామి

చేగుంట(తూప్రాన్): మండలంలో పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రామస్వామి అన్నారు. ఆదివారం రోజున రెడ్డిపల్లి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, బీకొండాపూర్‌లో సంజయ్, బోనాల్‌లో యాదగిరి, ఇబ్రహీంపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌లను ఎన్నుకొని నియామక పత్రాలను అందించారు. కృష్ణ, స్వామి, ఆగం తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): రాణి అహల్యాదేవి జయంతి వేడుకలను పురస్కరించుకొని సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రామాయంపేటలో క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు భానుచందర్, వీహెచ్‌పీ ప్రతినిధి పండరినాథ్, సామాజిక సమరసత వేదిక అధ్యక్షుడు బైరం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ



రామాయంపేటలో సైక్లింగ్ ర్యాలీ

రామాయంపేట(మెదక్): ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామాయంపేటలో సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. సైక్లింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై నుంచి ర్యాలీ కొనసాగింది. ఆరోగ్యవంతమైన భారతదేశం నినాదాంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతీ ఆదివారం తాము ఈ కార్యక్రమం నిర్వహిస్తామని కోచ్ యాదగిరి తెలిపారు.

రిలే నిరాహార దీక్షలకు సీపీఎం సంఘీభావం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో నస్కల్ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. మెదక్ జిల్లా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జీబ్ జాత బృందం రిలే దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నస్కల్ గ్రామంతో పాటు చుట్టూ నాలుగు గ్రామాల ప్రజలు రోడ్డు బాగోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక అవస్థలు పడుతూ ప్రమాదాలు గురై ప్రాణాలు పోతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు ప్రారంభించకపోతే జరగబోయే ప్రజా ఉద్యమాలకు సీపీఎం పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు నర్సమ్మ, పార్టీ జిల్లా బాధ్యులు మల్లేశం, వారి బృందం ఎల్లయ్య, రాజు, రమేశ్, నవీన్, సంజీవ్, ఎల్లం, సిద్ధిరాములు, మైసయ్య, దుర్గయ్య, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ ఎంపీటీసీ శివకుమార్ ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశం, పీఏసీఎస్ డైరెక్టర్ రాయకృష్ణ ఉన్నారు.

గ్రామాల్లో సమస్యల తిష్ట

- సర్వేలో అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు
- పడకేసిన పాలన
- గ్రామాల వైపు కన్నెత్తి చూడని వైనం



రోడ్డుపై ఉన్న చెత్తాచెదారం

హవేళిఘణాపూర్(మెదక్): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియగానే మండలాల వారీగా ఆయా గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో మెదక్, హవేళిఘణాపూర్ మండలంలోని గ్రామాల్లో సమస్యలు మితిమీరిపోతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో ప్రజలకు కనీస అవసరాలు తాగునీరు, విద్యుత్, మురికి కాల్వల లాంటి సమస్యలు ఉంటే గతంలో స్థానిక పంచాయతీ సర్పంచ్‌లు వాటిని పరిష్కరించేవారు. కానీ ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ వారు ఇన్‌చార్జి గ్రామాల వైపు కన్నెత్తి చూసిన పాపానాపోలేదు. ఏదైనా బిల్లులపై సంతకం పెట్టాల్సి ఉంటే వారి వద్దకే పిలిపించుకొని పనులు చేసి పంపిస్తున్నారు. పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు కాకపోడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీ సెక్రటరీలే తమ సొంత డబ్బులు పెట్టి పనులు చేయిస్తున్నారు.

ఆదాయం లేని గ్రామాల్లో అధ్వానం.

కొన్ని గ్రామాల్లో పన్ను రూపేనా వచ్చిన డబ్బులను గ్రామ పంచాయతీ కార్మికులకు చెల్లిస్తున్నారు. పన్నులు రాని పంచాయతీల సెక్రటరీలు కొందరు తమ సొంత డబ్బులు పెట్టి కార్మికులకు, విద్యుద్దీపాలు, ఇతర అవసరాలకు వెచ్చిస్తున్నారు. దీంతో గ్రామంలో ఏ పని చేయాలన్న డబ్బులు లేక పంచాయతీ సెక్రటరీలు తలలు పట్టుకుంటున్నారు. గ్రామ ప్రజల సమస్యలు వినలేక సమాధానం చెప్పలేక మొఖం చాటేసుకునే పరిస్థితి ఏర్పడిందని పంచాయతీ సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

గ్రామ సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో గ్రామాలకు ఆయా శాఖల అధికారులను ప్రత్యేక అధికారులను నియమించినా ఫలితం శూన్యమైంది. గ్రామాల్లో ఏదైనా సమస్య ఉంటే ప్రత్యేక అధికారికి ఫోన్ చేసి అడిగితే మీ పంచాయతీ సెక్రటరీకి చెప్పండి మాకెందుకు చెబుతున్నారంటూ ప్రజలపై మండిపడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఆయా శాఖల అధికారులను పంచాయతీ అధికారులుగా నియమించగా మా శాఖ పనులు మాకే చేసుకునేందుకు తీరిక లేకుండా ఉంటే అదనంగా ప్రత్యేక అధికారులుగా నియమించడంపై వారు విసుకుంటున్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం

గ్రామాల్లో కనీసం మౌళిక వసతులు కల్పించేందుకు విద్యుద్దీపాలు, తాగునీటి సరఫరా, మురికి కాల్వల పరిశుభ్రత లాంటి పనుల కోసం కార్మికులకు వేతనాలు చెల్లించలేక కొన్ని గ్రామాల్లో చెత్త ట్రాక్టర్లను రెండు, మూడు రోజులకోసారి చెత్త సేకరిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో అసలేం చేయలేమంటూ చేతులెత్తేశారు. దీంతో గ్రామాల్లోని వీధులు చెత్తతో నిండిపోయి దోమలు పెచ్చుమీరి అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉంది.



తాగునీరు రాక ప్రైవేటు బోరు వద్ద జనం

చాముండేశ్వరీకి మహాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటూ జరిగే ఆలయ 42వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి పూజ, స్వస్తి వచనం, కలశ స్థాపన పూజలు చేశారు. కలశ స్థాపన పూజ అనంతరం అర్చకులు కళశాలతో నీళ్లు తీసుకొచ్చి చాముండేశ్వరీ అమ్మవారి అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అమ్మవారి ఎదురుగా ఉన్న బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, హారతులు ఇచ్చారు. అమ్మవారి వార్షికోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చాముండేశ్వరీ సమితి, శాక్తమండల్ సభ్యులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆవుల పంపిణీ



ఖాజాపూర్ తండాలో ఆవులను అందిస్తున్న ఎస్‌ఐ నారాయణ, సంస్థ ప్రతినిధులు

చిన్నశంకరంపేట(మెదక్): గోశాల నుంచి రైతులకు ఉచితంగా ఆవులను అందించడం గొప్ప విషయమని ఎస్‌ఐ నారాయణగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఖాజాపూర్ తండాలోని రైతులకు హైదరాబాద్‌కు చెందిన సమర్థ కామదేను గోశాల ఆధ్వర్యంలో పది జతల ఆవులను అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రైతులు ఆవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు ఆవులను అందించేందుకు ముందుకొచ్చిన సానీక్ష ఫౌండేషన్, సమర్థ కామదేను గోశాల సంస్థను అభినందించారు. రైతులకు ఆవుల పంపిణీతో పాటు మహిళలకు చీరలను అందించారు. కార్యక్రమంలో అహల్యా, హెచ్‌టూహెచ్ చాణక్య స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శివ, డాక్టర్ పూనామ్, గీటేష్ కాటీ, దత్తత్రేయ, భాస్కర్, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ రవి, గ్రామ మాజీ సర్పంచ్ జంకి, తారాచంద్, నందారెడ్డి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



ఏడుపాయల కమాన్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఆదివారం ఏడుపాయల కమాన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు బ్రీత్ అనలైజర్ టెస్టులు నిర్వహించారు. పది మందిపై కేసులు నమోదు చేశారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మైకం మత్తులో వాహనాలు నడిపి అమూల్యమైన ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. పోలీసులు యాదగిరి, హోంగార్డు మల్లేశం ఉన్నారు.



కౌడిపల్లిలో ..

వాహనాల తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఆదివారం ఏఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేసి డ్రైవర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లొద్దని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు పాటించని వాహనాలకు ఆన్‌లైన్ ద్వారా జరిమానా విధించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో సంతోష్ టీం, ప్రశాంత్ టీం పోటీ పడ్డాయి. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ప్రశాంత్ టీం విజయం సాధించింది. ఇరుజట్లకు రాష్ట్ర బీజేపీ నాయకుడు మల్లేశంగౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు శ్రీశైలం యాదవ్ ప్రకటించిన నగదు ప్రోత్సాహకాన్ని, ట్రోఫీలను కార్యక్రమానికి హాజరైన బీజేపీ మండలాధ్యక్షుడు హరీశ్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రంగంపేట బూత్ అధ్యక్షుడు పోచందర్, ఏనగండ్ల బూత్ అధ్యక్షుడు లింగం, మండల సీనియర్ నాయకుడు శివప్రసాద్, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.



ఇరుజట్లకు ట్రోఫీలు, నగదు అందిస్తున్న బీజేపీ నాయకులు

అర్హులకు సంక్షేమ పథకాలు

మనోహరాబాద్(తూప్రాన్): అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో ప్రతీ గ్రామంలో రేషన్‌కార్డు, రైతు భరోసా లబ్ధిదారుల కోసం సర్వే చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మండలంలో కొత్తగా 372 రేషన్‌కార్డులు జారీ చేశామని, పాత రేషన్ కార్డుల్లో 858 మంది సభ్యుల పేర్లను జత చేసినట్లు తెలిపారు. ఉపాధిహామీ పనులు చేసే వారిలో ఉన్న భూమి లేని రైతులకు రైతు భరోసా అందజేస్తామన్నారు. రేషన్‌కార్డులు ప్రతీ కుటుంబానికి వస్తాయన్నారు. రానీ వారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తించి వారికి సైతం అందజేస్తామని సూచించారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్

నర్సాపూర్: హెడ్మాష్టరుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై కొందరు వ్యక్తులు దాడి చేశారని, దాడిని హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దాడికి నిరసనగా ఈనెల 20న ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్: బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ లింగం సూచించారు. పట్టణంలోని ఆయా బ్యాంకుల అధికారులతో ఆయన పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల్లో, ఏటీఎంల్లో దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బ్యాంకులు నేరాల నివారణకు తగిన చర్యలు చేపట్టినప్పుడే ఖాతాదారులకు నమ్మకం పెరుగుతుందని చెప్పారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

– మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి



తూప్రాన్: అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నేతలు అసత్య ఆరోపణలకు పాల్పడుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఆరోపణలు తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతలు మున్సిపల్‌లో ప్రజలను ఏ విధంగా ఇబ్బందులకు గురి చేశారో ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్‌లో చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేశారు. ఇకపై కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటుతో బుద్ధి చేప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

స్టేడియం నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలో స్టేడియం నిర్మించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో కొన్ని రోజులుగా నిర్వహించిన నర్సాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం ఏర్పాటు చేసిన క్రీడల ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ... త్వరలో స్టేడియం నిర్మాణ పనులు చేపడుతామన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని, ఓటమితో బాధపడకుండా, మరింత పట్టుదలతో నేర్చుకొని విజయం కోసం కృషి చేయాలన్నారు. పోటీల నిర్వాహకులు శంషూ, అజ్జూ, బషీర్‌లను సునీతారెడ్డి అభినందించారు. క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్న సుభాష్ టీం క్రీడాకారులకు కప్‌తో పాటు రూ.51వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానం దక్కించుకున్న సూర్య జట్టుకు రూ.16వేల నగదు, కప్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రాగౌడ్, షేక్ హుస్సేన్, మహ్మద్, నాగరాజు, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ఉత్సవాలు



ఎమ్మెల్యే సన్మానించిన ఆలయ నిర్వాహకులు



ఉత్సవాల్లో భక్తజన సందడి

0శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. కొండపైనున్న స్వామివారిని కాలినడకన వెళ్లి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్‌గుప్తా, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, సిబ్బంది నర్సింహారెడ్డి, విద్యాకర్‌చారి ఉన్నారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

లక్ష్మీనర్సింహస్వామిని ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమణగౌడ్, హరికృష్ణ, మన్సూర్, చంద్రగౌడ్, హన్మంత్‌రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్ రెడ్డి, రాకేష్‌రెడ్డి, లక్ష్మణ్, మహిపాల్‌రెడ్డి, భిక్షపతి రెడ్డి, తదితరులు ఉన్నారు.

నల్లపోచమ్మకు భక్తుల పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయంలో ఉదయం దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి, మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పాటు పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు.

పాక్షికంగా కూలిన యూత్ భవనం

తప్పిన ప్రమాదం

మనోహరాబాద్(తూప్రాన్): గడా ప్రత్యేక నిధులు రూ. 20లక్షలతో గ్రామ యువత కోసం యూత్ భవనాన్ని నిర్మించగా, ఆ భవనం నాణ్యత లోపంతో పాక్షికంగా కూలింది. ఆదివారం మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు ప్రతీ వారంలో భాగంగా యూత్ భవనం వద్దకు వెళ్లారు. అదే సమయంలో యూత్ భవనం ముందు భాగంలోని సజ్జ కూలింది. అదే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో యూత్ సభ్యులు మాట్లాడుతూ.. ఈ భవనం కట్టి మూడేళ్లు కూడా కాలేదని, కానీ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో నాణ్యత లోపించిందని ఆరోపించారు. నాణ్యత లోపంతో నిర్మించడం వల్లే సజ్జ కూలిందన్నారు. అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని యువకులు కోరారు.



కూచారంలో కూలిన యూత్ భవనం

సర్వే పరిశీలన

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలంలోని అక్కన్నపేట, వెంకటాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను ఆదివారం వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ పర్యవేక్షించారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్నారని, సాగుకు యోగ్యం అయ్యే, కాని భూముల వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గ్రామసభలను నిర్వహించండి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల వారీగా ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి అన్నారు. ఆదివారం ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను వారు పరిశీలించి, అధికారులకు సూచనలందించారు. ఏఈఓలు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దశంకరంపేట(మెదక్): బద్దారంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

అర్హులకు పథకాలు

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న సర్వేను ఆదివారం శివ్వంపేటలో పరిశీలించి సూచనలు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శివ్వంపేట(నర్సాపూర్): గురువులతో పూర్వ విద్యార్థులు



తూప్రాన్‌లో..

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. వీరిలో బాలకృష్ణ, శ్రీనివాస్, దీపక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రత్నపూర్ ఉన్నత పాఠశాల 1994–95, 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో ఒకటయ్యారు. వారి ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, వెంకటేశం, రవీందర్‌చారి, విద్యాసాగర్‌లను సన్మానించారు.